# సత్యమే మీకు ప్రాణము, ధర్మమే మీకు రక్ష

ప్రేమస్వరూపులారా! ఎన్ని సంవత్సరములు తపస్సు చేసినా, ఎన్ని తీర్థయాత్రలు సల్పినా, ఎన్ని శాస్త్రములు పఠించినా, ఎన్ని దాన ధర్మములు చేసినా ఇవేవీ మానవుని తరింపజేయజాలవు. అలనాడు రావణుడు నాల్గు వేదములు, ఆరు శాస్త్రములు పఠించాడు. కాని, తన మనసును ఏమైనా మార్చుకున్నాడా? లేదు; దైవత్వానికి బదులు దానవత్వాన్ని పెంచుకున్నాడు. వేదములు ఏమి బోధిస్తున్నాయి? శాస్త్రములు ఏమి చెప్పాయి? వేద శాస్త్రములు చెప్పినట్లుగా తానేమైనా నడుచుకున్నాడా? నడుచుకోలేదు. నిజానికి రావణుడు పది తలలతో పుట్టలేదు. పది తలలతో పుట్టియుంటే అతని ఘనత ఆనాడే లోకానికి వెల్లడయ్యేది. నాలుగు వేదములు, ఆరు శాస్త్రములు.. ఇవన్నీ చేరితే పది శిరస్సులైనాయి. అతనికి ఈ పది శిరస్సులుండి కూడా ప్రయోజనం లేకపోయింది. కనుకనే, రాముడు అతనికి పది శిరస్సులను ఖండించాడు. వేదశాస్త్రములను ఎంత పఠించినా వాటి ప్రబోధములను ఆచరణలో పెట్టకపోతే ఏమీ ప్రయోజనం ఉండదు. తెలుసుకున్నది ఒక్కటైనను ఆచరణలో పెట్టటం చాలా అవసరము.

వేదమంత్రాలను ఊరకే కంఠస్థం చేసినంత మాత్రాన మనసులో మార్పు కలగదు. జగత్తునకు ఈ విధమైన జ్ఞానోపదేశము గావించే నిమిత్తమై రాముడు రావణుని పది తలలను ఖండించాడు. భగవంతుడు ఏది చేసినప్పటికీ, ఏమి బోధించినప్పటికీ అంతా పరోపకార నిమిత్తమే గాని తన నిమిత్తం కాదు. కట్టకడపటికి రావణుడు కూడా తన దోషములను గుర్తించి పశ్చాత్తాపపడ్డాడు. పవిత్రుడయ్యాడు. దివ్యమైన, భవ్యమైన వేదప్రబోధలను ఆచరణలో పెట్టటం మానవధర్మము. మన విద్యా సంస్థలో సీనియర్ పిల్లలే గాక ప్రైమరీ స్కూలు పిల్లలు కూడా వేదాధ్యయనము చేస్తున్నారు. వారికి అన్ని వేదములు తెలుసు. అన్ని మంత్రాలనూ వారు ఉచ్చరిస్తున్నారు. తాము ఉచ్చరించే వేదమును ఆచరణలో పెట్టకపోతే ప్రయోజనం లేదని కూడా పిల్లలకు తెలుసు. కాని, ఆచరణలో పెట్టుటకు కావలసిన బుద్ధిశక్తి వారియందు తక్కువగా ఉన్నది.

'ఏకం సత్ విప్రా బహుధా వదన్తి' అన్నట్లుగా దైవము ఒక్కడే. 'ఉన్నదొక్కడె దైవంబు

srisathyasaivachanamrutam

ఎన్నటికిని, లేనిదయ్యెను లోకంబు కానరయ్య'. ఇట్టి పవిత్రమైన వేదసూక్తిని, శాస్త్ర ప్రబోధను మనం గుర్తించి వర్తించాలి. గ్రామఫోను ప్లేటు పాట పాడుతుంటే అందరూ విని ఆనందిస్తుంటారు. కాని ఆ పాటలోని మాధుర్యాన్ని గ్రామఫోను ప్లేటు ఏమాత్రం అనుభవించ జాలదు. ఎందరో సాధకులు వేదములను పఠిస్తూ, ఉచ్చరిస్తూ, ఇతరులకు బోధిస్తుంటారు. కాని, తాము స్వయంగా ఆచరించకుండా ఇతరులకు బోధిస్తుంటే, గ్రామఫోను ప్లేటుకు కలిగే ఫలితమే వారికి కూడా కలుగుతుంది. కనుక వేదప్రబోధలను మొట్టమొదట మనం గుర్తించి వర్తించాలి.

శ్రీకృష్ణుడు తాను ప్రబోధించిన ప్రతి విషయాన్ని మొట్టమొదట తాను స్వయంగా ఆచరించి ఆదర్శాన్ని అందించాడు. భగవంతునికి భేదము లేదు, ద్వేషము లేదు; ఆయన దృష్టిలో అందరూ సమానులే! అయితే పండితులు తాము నేర్చుకున్న విషయాలను ఎంతవరకు ఆచరణలో పెడుతున్నారనేది మాత్రం తాను గమనిస్తుంటాడు.

తపస్సు, తీర్థయాత్రలు చేసినటువంటివారు దివ్యత్వమును ఎంత వరకు అనుభవించారు? అనేకమంది జపము చేస్తుంటారు; వేద, శాస్త్రములను పఠిస్తుంటారు. కాని, ఏమి ప్రయోజనం? దివ్యత్వమును అనుభవించకపోతే అంతా వ్యర్థమైపోతుంది. అనేకమంది "స్వామీ! మాకొక జపమాల ఇవ్వండి" అని నన్ను అడుగుతుంటారు. జపమాల ఎందుకోసం? పదిమందికి కనిపించేటట్లుగా దానిని మెడలో వేసుకొని 'షో' చేయటంకోసమా? నిజంగా జపం చేయాలనుకునే వ్యక్తికి ఒక్క చేయి చాలు. (శ్రీవారు తమ కుడిచేతి బొటనవ్రేలితో ఒక్కొక్క వ్రేలిపై లెక్కపెడుతూ) రామ్ రామ్ రామ్ ... రామ్ రామ్ రామ్.... రామ్ రామ్ రామ్... రామ్ రామ్ రామ్... ఇవి పన్నెండు. ఈ 12 ను 9 తో గుణిస్తే 108 అవుతుంది. ఇదే జపమాల. ఇంక, మీకు మరో జపమాల అక్కర్లేదు. ఏ స్థానమునూ ప్రత్యేకంగా ఎన్నుకోవలసిన పని లేదు. దారిలో నడుస్తూ కూడను మీరు జపం చేసుకోవచ్చు; పండుకొని నిద్ర వచ్చేంతవరకూ మీరు జపం చేసుకోవచ్చు. ఇట్టి పవిత్రమైన, సులభమైన మార్గములెన్నో ఉండగా నిద్రాహారములు మానుకొని కఠినమైనటువంటి, చేతకానటువంటి సాధనలను మీరు ఎందుకు ఎన్నుకోవాలి?!

క్షమకు మారుపేరు ద్రౌపది

ద్రౌపది గొప్ప పతివ్రత. ఆమె తన భర్తలను ఎన్నో విధములుగా కాపాడుతూ వచ్చింది.



srisathyasaivachanamrutam

అశ్వత్థామ నిద్రిస్తున్న ఉప పాండవుల గొంతులు కోసినప్పుడు ఆమె ప్రదర్శించిన క్షమాగుణం సాటిలేనిది. అర్జునుడు అశ్వత్థామను పట్టి బంధించి తెచ్చి ద్రౌపది ముందు నిలబెట్టాడు. కొడుకులను బట్టి చంపెనని కోపము నొందుటకు బదులు ద్రౌపది అశ్వత్థామ పాదాలపై పడి ఈరీతిగా పలికింది "అయ్యా! నీవు నా కొడుకుల గొంతులు కోశావు. ఇప్పుడు నా భర్తలు నీ శిరస్సును ఖండిస్తే నీ తల్లి ఎంతగా బాధపడుతుందో నీకుతెలియదా? పసిబిడ్డల గొంతులు కోయటం వలన నీకు కలిగిన లాభమేమిటి? ఇది మహాపాతకమని తెలిసి కూడా ఈ పని నీవెలా చేయగలిగావు? నా పతులు నీ తండ్రిగారి శిష్యులు. కాబట్టి, మా బిడ్డలు నీ శిష్యులు. శిష్యులను హతమార్చటం మహాపాపం కదా! ఏ రాక్షసుడు కూడను ఇలాంటి దుర్మార్గానికి ఒడిగట్టడు. నీవు రాక్షసుడివి కావు; సకల శాస్త్రములు తెలిసిన పండితుడవు. ఇంతటి గొప్పవాడవైన నీవు ఇటువంటి అకృత్యానికి పాల్పడటం న్యాయంకాదు.

*పరగన్ మా మగవారలందఱును మున్బాణప్రయోగోపసం*
*హరణాద్యాయుధ విద్యలన్నియును ద్రోణాచార్యుచే నభ్యసిం*
*చిరి; పుత్రాకృతి నున్న ద్రోణుడవు; నీ చిత్తంబులో లేశముం*
*గరుణాసంగము లేక శిష్యసుతులన్ ఖండింపగా బాడియే?*

*ఉద్రేకంబున రారు; శస్త్రధరులై యుద్ధావనిన్ లేరు; కిం*
*చిద్ద్రోహంబును నీకు జేయరు; బలోత్సేకంబుతో జీకటిన్*
*భద్రాకారుల, చిన్న పాపల, రణప్రౌఢక్రియాహీనులన్,*
*నిద్రాసక్తుల సంహరింప నకటా! నీ చేతు లెట్లాడెనో?"*

అశ్వత్థామ శిరస్సును ఖండించటానికి సిద్ధపడిన అర్జునుని పాదాలు పట్టుకొని ద్రౌపది "అర్జునా! నీవు తపస్సు చేశావు. శాస్త్రములను పఠించావు. కాని, ఎన్ని చేసి ఏమి ప్రయోజనం? శాస్త్రములు తెలిసి కూడా వాటిని ఉల్లంఘించటానికి నీవు పూనుకుంటున్నావు. శాస్త్రములు ఏమని బోధిస్తున్నాయి?

*వెఱచినవాని, దైన్యమున వేదుఱు నొందినవాని, నిద్ర మై*
*మఱచినవాని, సౌఖ్యమున మద్యము ద్రావినవాని, భగ్నుడై*



srisathyasaivachanamrutam

*పఱచినవాని, సాధు జడభావమువానిని, గావుమంచు వా*
*చఱచినవాని, గామినుల జంపుట ధర్మము గాదు ఫల్గునా!*

కాబట్టి నీవితనిని క్షమించి విడిచిపెట్టటమే చాలా ఉత్తమమైన మార్గము. అంతేకాదు. నా కుమారులను కోల్పోయినందులకు నేనెంతగా విలపిస్తున్నానో నీవు అశ్వత్థామను సంహరిస్తే అతని తల్లి కూడా అంతగా దుఃఖిస్తుంది కదా! ఇతనిని చంపినంత మాత్రమున నా బిడ్డలు తిరిగి రారు కదా! పోయినవారి నిమిత్తమై ఇటువంటి పాపమును మూటకట్టుకోవటం చాలా తప్పు. భగవత్ప్రీతి కలిగినవారు ఇలాంటి అకృత్యానికి పాల్పడరు. కాబట్టి నీవితనిని చంపవలదు–అని ప్రార్థించింది. ఆ సమయంలో ద్రౌపది ఎంతో క్షమా గుణమును, శాంతమును ప్రదర్శించింది. అట్టిశాంతమును మనం అలవర్చుకోవాలి. హింసను దూరం చేయాలి. శాంతము చేత ద్వేషాన్ని జయించాలి. ద్రౌపది ఎంతో సహనముతో, శాంతముతో పలికిన మాటలు విని భీముడు ఉగ్రుడైనాడు.

*కొడుకులబట్టి చంపెనని కోపము నొందదు; బాలఘాతకున్*
*విడువుమటంచు జెప్పెడిని; వెట్టిది ద్రౌపది; వీడు విప్రుడే?*
*విడువగనేల? చంపు; డిటు వీనిని మీరలు సంపరేని నా*
*పిడికిటి పోటునన్ శిరము భిన్నము సేసెద జూడుడిందఱున్*

'ఈ పిచ్చి ద్రౌపది తన కుమారులను చంపిన అశ్వత్థామ పాదాలపై పడుతున్నదే' అని భీముడు పట్టలేనంత కోపంతో పిడికిలి బిగించి, కళ్ళెర్ర చేసి అశ్వత్థామపైకి వెళ్ళాడు. "ద్రౌపదీ! నీకేమైనా పిచ్చి పట్టిందా? నిర్దాక్షిణ్యంగా నీ కుమారుల గొంతులు కోసిన ఈ దుర్మార్గుణ్ణి రక్షించటానికి ప్రయత్నిస్తున్నావెందుకు? నా పిడికిటిపోటుతో వీని శిరస్సును ముక్కలు చేస్తాను. నీవు నాకు అడ్డు రావద్దు" అన్నాడు. కాని ద్రౌపది భీముని పాదాలపై పడి శాంతము వహించవలసిందిగా ప్రార్థించింది. చుట్టూ ఉన్నవాళ్ళు చాలా ఆశ్చర్యంగా చూస్తున్నారు; 'ద్రౌపది వంటి పిచ్చి స్త్రీలు లోకంలో ఎక్కడైనా ఉంటారా?!" అని అనుకున్నారు. కాని అటువంటి పిచ్చి అందరికీ పడితే ఈ లోకము బాగుపడుతుంది.

"ద్రౌపదీ! నేను అశ్వత్థామను చంపుతానని ప్రతిజ్ఞ చేశాను కదా! ఇప్పుడా మాట నేను

sri sathyasai vahini amrutam

నిలబెట్టుకోలేకపోవటం నాకవమానం కాదా?" అన్నాడు అర్జునుడు. అప్పుడు ద్రౌపది "అర్జునా! నీవు నీ మాటను నిలబెట్టుకోవాలంటే అశ్వత్థామను చంపవలసిన అవసరం లేదు. నీవతనిని లోపలికి గొనిపోయి, తల గొరిగి, శిరోమణిని పుచ్చుకొని, అతనిని బయటకు నెట్టివేస్తే చాలు; అది అతని ప్రాణము తీయటంతో సమానమౌతుంది" అన్నది. ఆమె సలహాననుసరించి అర్జునుడు అశ్వత్థామను పరాభవించి వదలిపెట్టాడు.

*విశ్వస్తుత్యుడు, శక్రసూనుడు, మహావీరుండు ఘోరాసిచే*
*నశ్వత్థామ శిరోజముల్ దఱిగి; చూడాంతర్మహారత్నమున్*
*శశ్వత్కీర్తి వెలుంగ బుచ్చుకొని, పాశవ్రాతబంధంబులన్*
*విశ్వాసంబున నూడ్చి, త్రోచె శిబిరోర్వీభాగముం బాసిపోన్*

ఎవరైనా మనకు ఏదైనా చెడు చేస్తే మనం కూడా తిరిగి వారికి అపకారం చేయటానికి పూనుకోకూడదు. కనుకనే, అశ్వత్థామను క్షమించి విడిచిపెట్టవలసిందిగా ద్రౌపది అర్జునుని పాదాలు పట్టుకొని ప్రార్థించింది. మహాభారతంలో ఇటువంటి ఉదాత్తమైన సంఘటనలు చాలా ఉన్నాయి. పరులను దూషించటం, నిందించటం, హింసించటం మహాపాపం. అటువంటి పాపానికి మనం ఎన్నడూ పూనుకోకూడదు. పాపమనగా ఏమిటి? పరులను పీడించటమే పాపము. పరులను పోషించటమే పుణ్యము. ఈ విధంగా ద్రౌపది తన పతులకు ఎంతగానో హితబోధలు సల్పుతూ వచ్చింది.

చివరికి, అశ్వత్థామ ద్రౌపది పాదాలపై పడి తనను క్షమించవలసిందిగా ప్రార్థించాడు. అప్పుడు ద్రౌపది "నాయనా! నీవు నా పాదములు పట్టుకోనక్కర్లేదు. నీ తల్లి పాదములు పట్టుకో. ఆమెకు దుఃఖం కలుగకుండా కాపాడుతూ రా" అని చెప్పింది. అతనిలో కలిగిన పరివర్తనను చూసి ఆమె ఎంతగానో సంతోషించింది. ఎలాంటి కష్ట పరిస్థితియందైనా ఆమె కంటిధారలు కార్చలేదు. అటువంటి పవిత్ర హృదయులైన స్త్రీలు ఈనాటికీ లోకంలో ఎంతోమంది ఉన్నారు. కష్టాలకు క్రుంగక వారు ఎంతో ధైర్యంతో, సాహసంతో జీవితాన్ని గడుపుతూ వస్తున్నారు. గుణవంతులైన స్త్రీల వల్లనే మన భారతదేశము ఇంతమాత్రమైనా నిలిచియున్నది. లేకుండిన ఈ ప్రపంచము ఏనాడో భస్మమైపోయేది. స్త్రీలలో గొప్ప ధైర్యమున్నది; మంచి పరాక్రమమున్నది; ధర్మమున్నది; పట్టుదలతో ఎలాంటి ఘనకార్యమునైనా సాధించగల దీక్ష ఉన్నది. ఇటువంటి

srisathyasaivachanamrutam

మహత్తరమైన శక్తులు మగవారిలో లేవు. కారణమేమిటి? మగవారిని క్రోధమనే శత్రువు అనేక విధాలుగా పట్టి పీడిస్తున్నది.

*కోపము కలిగినవానికి*
*ఏ పనియు ఫలింపకుండు ఎగ్గులు కలుగున్*
*పాపపు పనులను చేయుచు*
*ఛీ పొమ్మనిపించుకొనుట చేకూరు జుమీ !*

స్త్రీలలో ఉన్నటువంటి శాంతము, ధైర్యము, ఓపిక మగవారిలో లేవు. అయితే, స్త్రీలు కూడా ఒక్కొక్క పర్యాయము కోపతాపములకు లొంగిపోయి పాపము చేయవచ్చును. అట్టివారిని క్షమించి, ప్రోత్సహించి సన్మార్గములో త్రిప్పవలెనే గాని, వారిని దండించటం మంచిది కాదు. నిజంగా చూస్తే కోపము, తాపము, ఈర్ష్య, అసూయ, డంబము ఇత్యాది దుర్గుణాలు మగవారియందే ఎక్కువగా గోచరిస్తున్నాయి. స్త్రీలలో ఉన్నటువంటి శాంతము ఎంతో గొప్పది. ఆనాడు పాండవులను కాపాడినది ద్రౌపది యొక్క శాంతమే ! అటువంటి శాంతమూర్తులైన స్త్రీలు లోకంలో ఎందరో ఉన్నారు. వారిని ప్రోత్సహించటానికి బదులు స్త్రీలు కదా అని వారిని చులకన చేయటం చాలా పొరపాటు.

### సత్య ధర్మములే జగత్తునకు ప్రాణములు

'సత్యం వద, ధర్మం చర' అని ప్రబోధిస్తున్నది భారతీయ సంస్కృతి. ఈ రెండింటినీ కాపాడితే మనం దేశమునే కాపాడినవారమవుతాము. సత్యము చేత ధర్మమును కాపాడాలి. సత్యధర్మములే లోకాన్ని కాపాడుతూ వస్తాయి. మీరు దేశాన్ని రక్షించాలంటే సైన్యంలో చేరి యుద్ధం చేయనక్కర్లేదు; మీలో ఉన్న సత్యధర్మములను మీరు పోషించుకుంటే చాలు. సత్య ధర్మములను మొట్టమొదట మీ ఇంటియందు కాపాడుకోండి. సత్యధర్మములను కాపాడినప్పుడే మీరు మహా వీరులౌతారు; ధీరులౌతారు; గంభీరులౌతారు. మీరు సత్యధర్మములను కాపాడితే మిమ్మల్ని సర్వేశ్వరుడు కాపాడుతాడు. కాబట్టి, మీరు దైవాన్ని పూజించి మెప్పించటానికి ప్రయత్నించే బదులు సత్య ధర్మములను కాపాడుతూ రండి. అప్పుడు దైవము ప్రపంచాన్నంతటినీ కాపాడుతాడు. సత్యమే మీకు ప్రాణము. ధర్మమే మీకు రక్ష. శాస్త్రములలో ప్రధానమైనది ధర్మశాస్త్రము. సత్యములో మేటియైనది ఆడిన మాట తప్పకపోవటం. సత్యము ఎంత గొప్పదో

srisathyasai vachanamrutam

ధర్మము అంతకంటే గొప్పది. సత్యము లేని ధర్మము, ధర్మము లేని సత్యము జగత్తులో ఉండుటకు వీలుకాదు. సత్య ధర్మములే జగత్తునకు ప్రాణములు. "సత్య ధర్మము శాంతి ప్రేమలతో నీ నిత్యజీవన యాత్ర సాగించు." సత్య ధర్మములు నిలిచినప్పుడే ఈ ప్రపంచము కూడా నిలుస్తుంది. ఎట్టి ఆపద సంభవించినప్పటికీ మీరు సత్య ధర్మములను ఏమాత్రం వదిలిపెట్టకూడదు.

*ద్రౌపదికి సాటి ఏ పతివ్రతయు లేదు*

సత్యధర్మములను మీరు గట్టిగా పట్టుకున్నప్పుడు దైవమే ప్రత్యక్షంగా వచ్చి మిమ్మల్ని కాపాడుతుంటాడు. చరిత్రలో దీనికి అనేక దృష్టాంతములున్నవి. అలనాడు ద్రౌపది తన సత్య ధర్మములచేతనే పాండవులను కాపాడుతూ వచ్చింది. కాబట్టి, పతివ్రతల్లో ఎవరు గొప్ప అంటే ద్రౌపదే గొప్పదన్నారు.

*పతుల పలుమాటలకు ఎదురు చెప్పంగబోదు*
*వారి సేవలు చేయగా తీరదనదు*
*తనకున్నదానిచే తృప్తి గనుచునుండు*
*ద్రౌపదికి సాటి ఏ పతివ్రతయు లేదు*

'ఈ పని నా చేతకాదు' అని చెప్పదామె. అన్ని వేళల పతుల సేవ తప్ప తాను మరొక పని ముట్టుకోదు. ఇట్టి ద్రౌపది యొక్క ఆదర్శాన్ని ఈనాడు ఎంతమంది అనుసరిస్తున్నారు! ఆమె తన దుఃఖాన్ని తనలోనే అణచుకుంది. తన పతుల క్షేమము కొరకే గాక అందరి క్షేమము కొరకు ప్రార్థిస్తూ వచ్చింది. కనుకనే, తన కుమారులను హతమార్చిన అశ్వత్థామను సహితం క్షమించగలిగింది. ఆమె సత్య ధర్మములకు ప్రతీకగా నిలిచింది. సత్యధర్మములే పాండవులను కాపాడుతూ వచ్చాయి. ఎక్కడికి పోయినప్పటికీ మీ వెంట ప్రత్యక్షంగా నిలిచి మిమ్మల్ని కాపాడేవి సత్యధర్మములే! "ఈనాడు సత్యధర్మములు ఎవరిని కాపాడుతున్నాయి?" అని మీరు వాదించవచ్చును. చాలా పొరపాటు. బిడ్డలూ! సత్య ధర్మములే ప్రత్యక్ష దైవస్వరూపములు. మీరు సత్య ధర్మములను కాపాడినారంటే, అవి తిరిగి మిమ్మల్ని కాపాడుతూ వస్తాయి. కనుకనే, 'సత్యం వద, ధర్మం చర' అన్నారు. కాని, ఈనాడు సత్యమును వధిస్తున్నారు (సత్యం వధ); ధర్మమును చెఱసాలలో పెడుతున్నారు (ధర్మం చెఱ). ఇది మహాపాపము.

ప్రతి చిన్న విషయములోనూ మీరు సత్యధర్మములపైన ఆధారపడి ఉండాలి. మీ ప్రాణము కంటే సత్యధర్మములే ప్రధానమని భావించాలి. ప్రతి ఒక్కరినీ కాపాడేది దైవమే! కనుక, దైవాన్ని ప్రార్థించండి. దైవాన్ని విస్మరించి వ్యక్తులపై ఆధారపడటం పిచ్చితనం! అన్నింటికీ దైవాన్ని ఆధారం చేసుకోవాలి. అదే నిజమైన తపస్సు.

**స్త్రీలను గౌరవ భావంతో చూడాలి**

ద్రౌపదియొక్క భక్తి ప్రపత్తులే పాండవులనెంతగానో కాపాడుతూ వచ్చాయి. అనాది కాలమునుండి భారతదేశమునకు స్త్రీలే ప్రాణముగా, ఆధారముగా నిలిచారు. భారతీయ స్త్రీలు సత్య స్వరూపిణులు, ధర్మ స్వరూపిణులు, ఆదర్శప్రాయులు. అలాంటి స్త్రీలను మనం ఎంత గౌరవభావంతో చూడాలి! స్త్రీలను బాధించే వ్యక్తులు ఈనాడు అనేకమంది ఉన్నారు. దురభ్యాసము వలన, దుస్సంగము వలన విచక్షణ కోల్పోయి భార్యను హింసించే భర్తలు ఎందరో ఉన్నారు. ఆడవారిపైన ఎప్పుడూ చేయి చేసుకోకూడదు. భారతదేశములో స్త్రీలకు ఎంతో పవిత్రమైన, ఉన్నతమైన స్థానము అందించబడింది. ద్రౌపది వంటి పవిత్ర హృదయులైన స్త్రీలు దేశములో ఎందరో ఉండగా భారతీయులు అవస్థలకు గురి అవుతున్నారంటే, దోషం ఎవరిది? మగవారు స్త్రీలకు తగిన గౌరవమును, ఉన్నత స్థానమును అందించటం లేదు. కాబట్టి మగవారిదే తప్పు. స్త్రీలను తగినరీతిగా గౌరవిస్తూ, పోషిస్తూ రావాలి. ఎట్టి పరిస్థితిలోనూ మనం స్త్రీలను అగౌరవపరచకూడదు. సతులను హింసించే పతులు ఏమాత్రం శాంతిని పొందలేరు.

పతులకోసం తన ప్రాణాలనైనా ధారపోయటానికి సిద్ధపడతారు స్త్రీలు. అటువంటి స్త్రీలను కాపాడకపోతే, మగవారు బ్రతికి ఏం ప్రయోజనం? మన గృహమునకు స్త్రీలే గృహదేవతలు. స్త్రీల కంటి నుండి అశ్రుధారలు కారితే ఆ గృహము క్షీణించిపోతుంది. కాబట్టి, మగవారందరూ సత్యవ్రతాన్ని పూని స్త్రీలను కాపాడుతూ రావాలి. అనేక మంది దేవాలయాలకు వెళుతుంటారు. దేవాలయాలకు వెళ్ళినప్పుడు మొట్టమొదట స్త్రీలను కాపాడతామని ప్రతిజ్ఞ చేయాలి. స్త్రీలు క్షేమంగా ఉన్నప్పుడే లోకమంతా క్షేమంగా ఉంటుంది. ప్రపంచాన్ని బాగుపరచాలంటే మీరు మొట్టమొదట స్త్రీల ధర్మాన్ని కాపాడుతూ రావాలి. పతులను కోల్పోయిన స్త్రీలు ఎంత బాధపడుతున్నారో నాకు తెలుసు. అటువంటి స్త్రీలను కాపాడటం మన కర్తవ్యం. ఇట్టి కర్తవ్యాన్ని మీరు నిర్వర్తిస్తే జీవితమంతా ఆనందమును అనుభవిస్తారు.



srisathyasaivachanamrutam

## స్త్రీలు అబలలు కాదు; మహాశక్తి స్వరూపిణులు

ప్రేమస్వరూపులారా! సీత, ద్రౌపది మొదలైన సాధ్వీమణులు సత్య ధర్మములనే ఆధారము చేసుకొని తమ జీవితాన్ని గడిపారు. ఇలాంటి ఆదర్శమూర్తుల చరిత్రను మీరు చదవటం లేదు. ఏవేవో పిచ్చిపిచ్చి కథల పుస్తకాలన్నీ చదువుతుంటారు. నీచమైన కథల పుస్తకాలు చదివే బదులు పవిత్రమైన మన ప్రాచీన చరిత్రను చదవండి. భారతీయ స్త్రీల తత్త్వము మహా పవిత్రమైనటువంటిది. పతికోసం సతి ప్రాణాలనైనా ఇవ్వటానికి సిద్ధంగా ఉంటుంది. అట్టి త్యాగనిరతి మగవారిలో లేదు. స్త్రీల వలె పురుషులు కూడా త్యాగభావమును అలవరచుకోవాలి. స్త్రీలను కాపాడుకోవాలి. కుటుంబ గౌరవాన్ని నిల్పుకోవాలి. అప్పుడే మగవారనే పేరు మీకు సార్థకమవుతుంది. లేకపోతే, ఏదో గడ్డాలు, మీసాలు పెంచుకొని తిరిగినంత మాత్రమున మీరు మగవారవుతారా?! అది కాదు మగతనానికి గుర్తు.

ప్రేమస్వరూపులారా! స్త్రీలు అబలలని మీరు భావిస్తున్నారు గాని, నిజానికి వాళ్ళు మహాశక్తి స్వరూపిణులు. వారు తలుచుకుంటే ఎంతటి ఘనకార్యమైనా సాధించగలరు. స్త్రీలను పోషించటానికి, స్త్రీల ధర్మాన్ని కాపాడటానికి మన ప్రాణాన్నైనా ఇవ్వాలి. నాటినుండైనా మనం ప్రపంచంలో స్త్రీల ధర్మాన్ని పోషిస్తూ, స్త్రీల పవిత్రతను కాపాడుతూ రావాలి. స్త్రీలు కూడా ఇందుకు తగిన దీక్షను పూనాలి. పతిని దైవముగా భావించే సతియే సతి. స్త్రీలను కాపాడటం మీ కర్తవ్యము. అది మీ ధర్మము. కుటుంబాన్నంతటినీ కాపాడటం ఆమె కర్తవ్యము.

స్త్రీలను మీరు కాపాడితే జగత్తునంతటినీ వారు కాపాడుతూ వస్తారు. కనుక, స్త్రీలను ఏదో ఆట బొమ్మలమాదిరి మీరు చూడకండి. ఇకముందైనా మీరు స్త్రీలను కాపాడుతూ, వారిని గౌరవిస్తూ, మీరు కూడా గౌరవాన్ని పెంచుకోవటానికి తగిన ప్రయత్నం చేస్తారని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

(2004 సెప్టెంబరు 6వ తేదీ కృష్ణాష్టమి సాయంత్రం సాయికుల్వంత్ సభా మండపములో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)

srisathyasaivachanamrutam